www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 11 నవంబర్ 2023 5 కాకినాడ



విద్యార్థి కిడ్నాప్‌పై ఎంఇఒ విచారణ

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

పట్టణంలోని ఎన్‌టిఆర్ ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థి కిడ్నాప్ అంశంపై ఎంఇఒ పి.పుల్లయ్య, మానవ హక్కుల సంఘం ప్రతినిధి నూతలపాటి అప్పలకొండ శుక్రవారం విచారణ జరిపారు. పాఠశాల తరగతి గది నుంచే గురువారం విద్యార్థి కిడ్నాపైన విషయంపై పాఠశాల హెచ్‌ఎం, సంబంధిత ఉపాధ్యాయుని వారు ఆరా తీశారు. విద్యార్థి బంధువునని తమను నమ్మించి బాలుని తీసుకెళ్లినట్టు ఉపాధ్యాయులు వివరణ ఇచ్చారు. రికార్డులో సంతకం కూడా తీసుకున్నామని వారు బదులిచ్చారు. కిడ్నాపర్లు బాలుని వదిలి వెళ్ళినందున అందరూ ఊపిరి పీల్చుకున్నామని లేదంటే పరిస్థితి ఏమిటని ఎంఇఒ ఉపాధ్యాయులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుంచే నాని బాబు, ఎస్.రెహమాన్ పాల్గొన్నారు.

రబీకి నీటి గండం..!

- ఖరీఫ్‌లోనూ అన్నదాతలత అష్టకష్టాలు
- వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న వైనం
- అధ్వానంగా సాగునీటి కాలువలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అన్నదాతలను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావం నెలకొంది. జూన్ నుంచి జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతోంది. జూన్‌లో 52.7, ఆగస్టులో 61.1, సెప్టెంబరులో 18.1, అక్టోబరులో 88.0 లోటు వర్షపాతం నమోదయ్యింది. మరోవైపు కాలువల ద్వారా నీరు సక్రమంగా అందని పరిస్థితుల్లో ప్రస్తుతం పలు ప్రాంతాల్లో వరి, ఇతర పంటలు ఎండిపోయాయి. ప్రధానంగా మెట్ట మండలాల్లో రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టగా నష్టపోయారు. ఇప్పుడు జిల్లావ్యాప్తంగా రబీకు నీటి గండం తప్పేలా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవకపోవడం ఒక కారణం కాగా సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయి అధికారుల నిర్లక్ష్య వైఖరిని వెక్కిరిస్తున్నాయి.

జిల్లాలో 21 మండలాల్లో ఈ ఏడాది 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యింది. వర్షాలు లేకపోవడంతో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు వరి పంట వేయలేదు. మెట్ట మండలాలైన తుని, కోటనందురు, రౌతులపూడి, తొండంగి, జగ్గంపేట, శంఖవరం ప్రాంతాల్లో కరువు తాండవిస్తోంది. 39 వేల ఎకరాల్లో వరి సాధారణ విస్తీర్ణం కాగా 30 వేల ఎకరాల్లో పంట వేశారు. ఈ ఏడాది వర్షాలు లేక వేసిన పంటలకు నీరు పూర్తిగా అందక పంటలు ఎండిపోయి భారీ నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏలేశ్వరంలో నీరు లేకుండా దర్శనమిస్తున్న ఏలేరు ప్రధాన కాలువ

రబీకి సాగు నీరందేనా..?

పుష్కర ఎత్తిపోతల పథకం పరిధిలోని తాళ్లూరు లిఫ్ట్ ఆయకట్టు కింద జగ్గంపేట మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 6 గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో వరి ఎండిపోయింది. దీనిపై నష్టపరిహారం ఇప్పించాలని రైతులు ఆందోళన చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. చెరువులు సైతం ఎండిపోవడంతో కనీసం పశువుల తాగునీటికైనా ఇబ్బందులు లేకుండా చూడాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తుంది. ఏలేరు ప్రాజెక్టు సాగు నీటి ఆధారంగా జగ్గంపేట, పెద్దాపురం, తుని, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లోని దాదాపు 53 వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. ప్రస్తుతం సరిపడా సాగునీరు ఉన్నా ఫేజ్-1, ఫేజ్-2లలో రూ.394 కోట్ల నిధులతో అభివద్ధి పనులు జరగకపోవడంతో ఎక్కడికక్కడ కాలువలు ఆధునీకరణకు నోచుకోలేదు. ప్రధాన కాలువతో సహా పిల్ల కాలువల్లో సైతం భారీ ఎత్తున గుర్రపు డెక్క, పూడిక పేరుకుపోయింది. ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రత్తిపాడు మండలం పరిధిలో ఉన్న సుబ్బారెడ్డి సాగర్ క్రింద 10 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. 20 గ్రామాలకు ఈ సాగర్ నీరే ఆధారం. మరమ్మతుల పనులు చేయక 2 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందింది.మిగిలిన 7 వేల ఎకరాల్లో పంటలు ఎండుముఖం పట్టాయి. తుని, కోటనందూరు, రౌతులపూడి మండలాలకు తాండవ నీరు ప్రస్తుతం అరకొరగానే వస్తుంది.

ఖరీఫ్‌కే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే రబీకి జిల్లాలో సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. గతేడాది జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరగ్గా ఈ ఏడాది ప్రశ్నర్ధంకంగా మారింది.

రబీలో పంటలు వేయలేం



రబీలో పంటలు వేయలేం

ప్రతి సంవత్సరం రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. ఈ ఖరీఫ్‌లో సాగునీరు లభ్యత లేక పంటలు వేయలేకపోయాం. వచ్చే రబీకు పంటలు వేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

- సత్తిబాబు, కౌలు రైతు, ఎన్.సూరవరం, తుని మండలం

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) 24వ రాష్ట్ర మహాసభ డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో కాకినాడలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబు తెలిపారు. శుక్రవారం మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం స్థానిక యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల కోసం ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్రంలో దేశంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో విద్యార్థి లోకాన్ని చైతన్య పరచడం కోసం మరిన్ని పోరాటాలు నిర్వహించడం కోసం డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకీ రాకముందు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని మొత్తం కార్పొరేట్, ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలో విద్యారంగంలో వస్తున్న మార్పులు వివిధ విద్యారంగ విధానాలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో శ్రీ అగస్త్య విద్యాసంస్థల చైర్మన్ డి.నాగేశ్వరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు నగేష్, టిడిపి నగర నాయకులు రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు టి.రాజా, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు పి.నాగేశ్వరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి పద్మ, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, వాసుదేవ్, రాము, గోపాల్, సంజయ్, శివ, సిద్ధు, వెంకటేశ్, చిన్ని, మల్లేశ్వరి, రాజేష్ ,ఆదర్శ పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి ఐవి

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు కలెక్టరు కృతికా శుక్లా తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లా గ్రంథాలయ అధికారులతో కలిసి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయ నిర్వాహకులందరూ ఈ వారోత్సవాలను సక్రమంగా నిర్వహించడం ద్వారా ఎక్కువ మంది పాఠకులు గ్రంథాలయాలకు వచ్చేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి విఎల్ఎన్ఎస్వి.ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు, డిప్యూటీ లైబ్రేరియన్ కె.కిషోర్, లైబ్రేరియన్ ఎం.శ్రీనివాసరావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది సలాది రాజు, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని ర్యాలీ

ప్రజాశక్తి-కాకినాడ

ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని కోరుతూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా అర్బన్ తహశీల్దారు కార్యాలయం నుంచి బాలాజీచెరువు సెంటర్ వరకూ శుక్రవారం కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ 1945లో 10 శాతం భూభాగం మాత్రమే కలిగిన ఇజ్రాయిల్ 2023 నాటికి 90 శాతం పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకుందన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి హమాస్ దాడులు ఒక సాకు మాత్రమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వ శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, పలు ప్రజా సంఘాల నాయకులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, భారతి, వేణి, నాగలక్ష్మి, చామంతి, తోకల ప్రసాద్, పప్పుల ఆదినారాయణ, జాన్ బాబు, కాటంరాజు, శేఖరు, వీరబాబు, జల్లూరి వేంకటేశ్వర్లు, దూసర్లపూడి రమణరాజు, జి.సత్యన్నారాయణ, నాగేశ్వరరావు, నరసరాజు, తాళ్లూరి రాజు, జి.సాయిబాబు, తాతపూడి రామకృష్ణ, రాజారావు, గోపిశెట్టి బూరయ్య, పరశురాం, గోవింద్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

పలుచోట్ల టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

పలు ప్రాంతాల్లో టిడిపి ఆధ్వర్యాన శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గారంటీ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

రౌతులపూడి మండలం బంగారయ్యపేటలో టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లికరపత్రాలను పంచారు. తమరాల సత్యనారాయణ, పైల సాంబశివరావు, భాస్కర్ బాబు, గొల్లు పెద్ద దివాణం, కోసూరి కృష్ణ వర్మ పాల్గొన్నారు. **కరప** టిడిపి కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమూర్తి విజయరాయుడు పాలెంలో ప్రచారం చేశారు. కుడిపూడి సత్తిబాబు, గుల్లిపల్లి శ్రీనివాసరావు, బుంగా సింహాద్రి, పొలసపల్లి సరోజ, పలివెల జానకి రామయ్య, మిరపల ప్రకాష్ పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కుమారుడు రంగనాగ్ 14వ వార్డు సంగీతరావుపేటలో ప్రచారం చేశారు. అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, ముమ్మిడి సూరిబాబు, బొందల రామలక్ష్మి పాల్గొన్నారు.

ఏటిపట్టు గ్రామాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని ఏటిపట్టు గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజా రక్షణ భేరి యాత్రలో సిపిఎం నాయకులు విమర్శించారు. శుక్రవారం 3వ రోజు యాత్ర జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి, చదలాడ, తిరుపతి, మర్లావ, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో బెల్లం తయారీ కేంద్రాలు, జగనన్న కాలనీలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుంటే వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మరిన్ని భారాలు వేస్తోందన్నారు. ఈ జాతాలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, రూరల్ కార్యదర్శి కేదారి నాగు, నాయకులు గరగపాటి పెంటయ్య, దారపురెడ్డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, లెక్కల నరసింహమూర్తి, దారపురెడ్డి కృష్ణ, సిరపరపు శ్రీనివాస్, మంతెన సత్తిబాబు, మరిడియ్య, యాసలపు రమేష్, జగదీష్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్రలో నాయకులు

పలుచోట్ల మళ్లీ జగనే ఎందుకంటే

సిఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యం

వైసిపి ఆధ్వర్యాన శుక్రవారం పలుచోట్ల జగనే ఎందుకు రావాలి కారక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

పెద్దాపురం ప్రజల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ద్వారానే సాధ్యమవుతుందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. 1, 2 వార్డుల సచివాలయాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరెళ్ల వీర రాఘవ, ఆకుల కృష్ణ బాపూజీ, త్సలికి సత్యభాస్కరరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు కాపుగంటి కామేశ్వరరావు, రాజా, హరిబాబు, పెద్దకాపు, భీమరాజు, చింతా శ్రీనివాసరావు, బొడ్డు ప్రకాష్ పాల్గొన్నారు. **గండేపల్లి** తాళ్లూరు సచివాలయంలో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు మాట్లాడారు. ఒబిన్ని వీరబాబ, వైస్ ఎంపిపి కుంచే రాజా, కందుల చిట్టిబాబు, సర్పంచులు పోకల సుబ్బారావు, అడబాల ఆంజనేయులు, ములంపాక సురేష్ బాబు పాల్గొన్నారు. మల్లేపల్లిలో రామకుర్తి బ్రహ్మాజీ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో తోట రామ్‌జీ, రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, గుల్లా ఏడుకొండలు, కుంచే చినబాబు, కోర్పు దుర్గాప్రసాద్, ఓబిన్ని సత్యనారాయణ, అత్తులూరి సాయిబాబు, గఫూర్, తోట అయ్యన్న పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** మల్లిసాలలో ఎంపిడిఒ వసంత కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, ఒమ్మి రఘురామ్ పాల్గొని ప్రసంగించారు. ఇఒపిఆర్‌డి కొండలరావు, జెసిఎస్ కన్వీనర్ బండారు రాజా, నాయకులు అత్తులూరి శ్రీను, పారిపిరెడ్డి కోదండ, నక్కరాజు వీరబాబు, ముత్తా రాజబాబు, గనియ్య పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** సీతాఫల్ దొడ్డి సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఆవాల లక్ష్మీనారాయణ, ఆవాల రాజేశ్వరి, కమిషనర్ రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, మద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



జగ్గంపేట రూరల్‌లో సమావేశం లో మాట్లాడుతున్న రఘురాం

యుటిఎఫ్ కాకినా రూరల్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

యుటిఎఫ్ కాకినాడ రూరల్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. యుటిఎఫ్ హోమ్‌లో రూరల్ అధ్యక్షుడు ఎండి తానీషా అధ్యక్షతన నూతన కౌన్సిల్ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి టి.అన్నా రాము, రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా అధ్యక్షుడు కెవివి.నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి, యుటిఎఫ్ పూర్వ నాయకులు పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు కె.సత్తిరాజు, జిల్లా అసోసియేట్ మహిళా అధ్యక్షురాలు బి.నాగమణి, అబ్జర్వర్ ఎస్‌కె.రహమాన్ ఎన్నికలను పర్యవేక్షించారు.

చదువుతోపాటు విజ్ఞానం అవసరం

చదువుతోపాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ సూచించారు. ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023 శుక్రవారం ముగిసింది. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ, కాకినాడ సీపోర్ట్, రోటరీ క్లబ్, బ్లడ్ క్రాస్ సోమయాజి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సైన్స్ కాంగ్రెస్‌లో బహుమతి ప్రదానోత్సవంలో శుక్రవారం పద్మశ్రీ మాట్లాడారు. విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇటువంటి ప్రదర్శనలు సహకరిస్తాయని అన్నారు. శాస్త్ర సాంకేతిక మండలి సేవలను ఆమె అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు మెమెంటోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.విజయ్ కుమార్, ఎఎంసి చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి గోపి కాశీ విశ్వనాథ్, అరిగిన బాబి, చారిటీస్ కరస్పాండెంట్ పి.బాబూరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.అమరేశ్వరరావు పాల్గొన్నారు.

31వ వార్డులో తాగునీటి ఇబ్బందులు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్


స్థానిక 31వ వార్డులో ప్రజలు తాగునీటికి ఇబ్బందులకు గురవుతున్నారు. బోరు ఎలక్ట్రికల్ మోటార్ ఫేజులు కాలిపోవడంతో వార్డు ప్రజలు శుక్రవారం తాగునీరందక ఇబ్బందులు పడ్డారు. కుళాయిల ద్వారా మున్సిపల్ అధికారులు అందించే రక్షిత మంచినీరు ప్రజలకు సరిపడకపోవడంతో వార్డులో ఉన్న బోరు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తూ వస్తున్నారు. వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ప్రజలకు అందించే ఏర్పాటు చేశారు. సరైన బోర్ ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంతో తరచూ తాగునీటి ఇబ్బందులు తమకు ఎదురవుతున్నాయని వార్డు ప్రజల ఆవేదన వ్యక్తం చేసారు. దీంతో అధికారులు బోరు రిపేరు పనులను చేపట్టారు. పాతమోటారు స్థానంలో రూ.లక్ష వ్యయంతో కొత్త మోటారును మున్సిపల్ కమిషనర్ చొరవతో ఏర్పాటు చేశారు.

లహరి దుర్గకు ఆర్‌జెడి అభినందన

ప్రజాశక్తి-కాకినాడ

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన కాకినాడ సాలిపేట కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థిని గంపల లహరిదుర్గను పాఠశాల విద్య ఆర్‌జెడి జి.నాగమణి అభినందించారు. 67వ ఎపి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలికల పోటీల్లో లహరి దుర్గ ఆర్టిస్టిక్, ట్రెడిషనల్ యోగా విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించింది. యోగా విద్యా పీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టి బాబు, జాతీయ యోగా కోచ్ ధర్మాడి దుర్గా శాంత ప్రసాద్ విద్యార్థినితో కలిసి ఆర్‌జెడిని కలిశారు.

కార్టూ'నిజం'



తలెత్తుకుంది గర్వంతో కాదు... ఆకాశాన్నంటిన ధరలకేసి చూస్తూ..!

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య విద్యా ప్రాంగణంలో గురువారం నుంచి జరుగుతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ (పురుషులు) టోర్నమెంట్ 2023 పోటీలు హోరాహోరీగా ఆద్యంతం రసవత్తరంగా సాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో రెండో రోజు వివిధ టీముల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. నిన్న రాత్రి 11-00 గంటల వరకు జరిగిన పోటీలు ఈ రోజు ఉదయం 7-00 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. దక్షిణాది (ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి) ఆరు రాష్ట్రాలకు చెందిన 113 యూనివర్సిటీలకు చెందిన 95 టీములు సుమారు 1200 మంది ఆటగాళ్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రావీణ్యాన్ని చూపుతున్నారు. అనుభవజ్ఞులైన న్యాయనిర్ణేతలు పర్యవేక్షణలో పూర్తి పారదర్శకంగా స్నేహపూర్వక వాతావరణంలో విద్యార్థుల కేరింతలతో పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగుతున్నాయి. నాకౌట్ తరహాలో నిన్న జరిగిన 33 మ్యాచ్‌లలో గెలుపొందిన వారు తర్వాతి రౌండ్ కు అర్హత సాధించారు. ఈ రోజు మరో 33 టీములు పోటీలు జరిగిన పోటీల్లో గెలుపొందిన విజేతలు తర్వాత రౌండ్‌లకు అర్హత సాధించారు.



పోటీల్లో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

వడ్లమూరులో ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం వడ్లమూరులో రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా శుక్రవారం ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన బిక్కిన బ్రహ్మారాజు పండించిన స్వర్ణ రకం ధాన్యం 114 క్వింటాళ్లు వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీర రాఘవరావు ద్వారా కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో కంటే రామకృష్ణ, అల్లాడి రాజు, గంగాధర్, చంద్రు సురేష్, బల్ల ప్రసాద్, యడ్లపల్లి సన్యాసిరావు, అసిస్టెంట్ శ్రీవాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పరీక్షలు

ప్రజాశక్తి -కరప

గురజనాపల్లి పప్పినీడి పాపారావు జెడ్‌పి హైస్కూల్లో 160 మంది విద్యార్థులకు విద్యార్థులకు చెకుముకి పోటీ పరీక్షలకు శిక్షణ అందించి, పరీక్షలు నిర్వహించినట్టు హెచ్‌ఎం ఎం.సాయి మోహన్ తెలిపారు. ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లాలో నిర్వహించే పోటీలకు పంపిస్తామన్నారు. విద్యార్థులకు గణితం, శాస్త్రీయ విజ్ఞానం అందించడానికి ఈ పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రసాదరావు తెలిపారు.

బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన

ప్రజాశక్తి-అన్నవరం

నేటి సమాజంలో బాల్యవాహాలు కట్టడికి ఆడపిల్లలకు చదువే దోహద పడగలదని డిసిపిఒ వెంకట్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్‌పి హైస్కూల్లో శంఖవరం మండలం ఐసిడిఎస్ పిఒ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయడం శిక్షార్హమని ప్రోత్సహించిన వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష అని తెలిపారు. ఐసిడిఎస్ పీడీ ప్రవీణ్ మాట్లాడుతూ ఆడపిల్లలను బతకనిద్దాం వారిని ఎదగనిద్దాం ఇది మన అందరి బాధ్యత చెప్పారు. అనంతరం ఆడపిల్లలను కాపాడుకుందాం, ఆడపిల్లలను చదివిద్దాం బాల్య వివాహాలు వద్దు, చదివే ముద్దు, ఇది మనందరి బాధ్యత అంటూ ఐసిడిఎస్ సిబ్బంది ఫ్ల కార్డులతో ఆటపాటలతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఐసిడిఎస్ పిఒ పద్మావతి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిబ్బంది

ఆటో డ్రైవర్లకు లైసెన్స్‌లు తప్పనిసరి

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సిఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐ వారికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పిఠాపురం పట్టణం పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్నందువల్ల దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తున్నారని కావున వారికి సరైన రీతిలో సేవలందించాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఎవరూ మద్యం సేవించి ఆటో నడపరాదని, పరిమితికి మించి ప్యాసింజర్లను వాహనంలో ఎక్కించరాదని హెచ్చరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు



చొల్లంగి లో జరిగిన రోడ్డు ప్రమాదం

చొల్లంగిలో రోడ్డు ప్రమాదం 14 మందికి గాయాలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం జాతీయ రహదారి 216 పై చొల్లంగిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. అదే సమయంలో కాకినాడ వైపు నుంచి చొల్లంగి పేట వెళుతున్న మరొక ఆటో కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక ఆటో డ్రైవర్ తో పాటు ఆయా ఆటోల్లో ఉన్న 10మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు దంపతులకు, మరొక ఆటో డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ఉన్న దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకో గలిగారు. పెద్దాపురం, సామర్లకోట తదితర ప్రాంతాలలో చేపలు అమ్ముకుని తాళ్లరేవు మండలం చొల్లంగి కొబ్బరి చెట్టు పేటకు తిరిగి వస్తున్న 8 మంది మహిళలు, మరో ఆటోలో ఉన్న ఇద్దరు ప్రమాదంబారిన పడ్డారు. క్షతగాత్రులను 108 వాహనాలలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఈర్ల బాబురావు(ఆటో డ్రైవర్), కోనాడ కామేశ్వరి, శ్రీ కోటి లక్ష్మి, కోనాడ సత్యవతి, నీలపల్లి లక్ష్మి, రామిశెట్టి ఎల్లారి, సోది పద్మ, నీలపల్లి దేవి, గంపల నూకరత్నం, మేకల కస్తూరి, మేకల ఆనంద్, కు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న దొంగ రామచంద్రరావు, దొంగ సునీత, మరొక ఆటో డ్రైవర్ తులసి శ్రీనివాసరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు, ఆటో ముందు భాగాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల ఎస్ఇబి దాడులు

ప్రజాశక్తి-గోపాలపురం, ఏలేశ్వరం

ఎస్ఇబి అధికారులు మండలంలో పలుచోట్ల దాడులు నిర్వహించి పలువురుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఇబి సిఐ డి.సుధా తెలిపారు. శుక్రవారం ఎస్ఇబి అధికారులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ, సిబ్బందితో మండలంలోని జగన్నాధపురం గ్రామంలో దాడులు నిర్వహించారు. ఎర్రమల్ల రవి శంకర్ 10 మద్యం బాటిల్స్ కలిగి ఉండడంతో అతన్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వాదాలకుంట గ్రామంలో దాడులు నిర్వహించగా పాక విజయలక్ష్మి ఐదు లీటర్ల నాటు సారా కలిగి ఉండడంతో ఆమెను, అదే గ్రామంలో కనికేళ్ళ మరియమ్మ 5 లీటర్ల నీరు నాటు సారా తో పట్టుబడినట్లు వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఈ దాడులలో ఎస్ఈబి అధికారులు బి. వెంకన్న బాబు,పి. సుధీర్, సిబ్బంది పుష్ప గిరిబాబు, సిహెచ్ రామన్న తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండలం పెద్ద శంకర్లపూడి గ్రామ పంట పొలాలు, కాలువ గట్లపై ఎస్ఇబి అధికారులు శుక్రవారం దాడులు చేపట్టారు. ఎస్ఇబి సిఐ పి.అశోక్ తెలిపిన వివరాలు ఇవి.. కాలువ గట్టుపై గల పొదల్లో సారా బట్టి, 200 లీటర్ల బెల్లపు ఊట, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా బట్టి, బెల్లపూటను ధ్వంసం చేసి పరార్ లో ఉన్న బట్టి యజమాని నెర్ల రాంబాబు పై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి.శ్రీనివాస్ హెడ్ కానిస్టేబుల్ నాగార్జున, వెంకన్న దొర కానిస్టేబుళ్లు దొరబాబు, వెంకటేశ్వరరావు, రామకష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



పశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు 'గౌతమి' విద్యార్థుల ప్రాజెక్ట్ ఎంపిక

ప్రజాశక్తి-మండపేట

అమలాపురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూలోంల జరిగిన 'నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్ట్ ప్రదర్శన"లో మండపేట పట్టణంలో గౌతమీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లావణ్య, స్పందన తయారుచేసిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శోభావళి తెలిపారు. వృథాగా పారవేసే పండ్ల తొక్కలు ఆహార పదార్థాల వ్యర్థాలు నుంచి మన ఇంటికి అవసరమైనటు వంటి రసాయనాలను తయారు చేసుకోవచ్చు చెత్తను చెత్త ద్వారా తొలగించడం అనే ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. పండ్ల తొక్కల నుంచి కూరగాయల వ్యర్థాల నుండి బయో ఎంజైమ్ తయారు చేయడం ద్వారా వాట ని దుస్తులుక్లీన్ చేయడానికి, బాత్రూం వాషింగ్ కొరకు వాడే క్లీనింగ్ ఏజెంట్లకు ప్రత్యామ్నాయంగా ఫ్రిడ్జ్ శుభ్రం చేయుటకు ఉపయోగించవచ్చునన్నారు. అవార్డు ఎంపిక సందర్భంగా ప్రశంస పత్రాలను అందుకున్నారు. ప్రాజెక్ట గైడ్ టీచరుగా జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మేకా రామలక్ష్మి వ్యవహరించారు. డిఇఒ ఎం.కమలకుమారి, జిల్లాసైన్స్ అధికారి జీవీస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

చిందాడగరువు గ్రామానికి చెందిన పేద వృద్ధ దంపతులు దాసరి చిన సత్తియ్య, వీరమ్మ లకు శుక్రవారం జనసేన నాయకులు శ్రీహరి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు సమకూర్చారు. ఆ దంపతులు వయోభారంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరి పరిస్థితి ఆ ప్రాంత జనసేన నాయకులు మోటూరి వెంకటేశ్వరరావు ద్వారా తెలుసుకున్న సూరపరెడ్డి సురేష్ అమలాపురం జనసేన నాయకులు శ్రీహరిని సత్తియ్య దంపతులకు సాయం చేయాలన్నారు. ఆయన స్పందించి నిత్యవసర సరుకులు ఎంపిటిసి సభ్యురాలు మోటూరి కనకదుర్గ చేతుల మీదగా అందజేశారు.

యానాం వార్తలు

వాసు రెసిడెన్సీని ప్రారంభించిన ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

యానాం-ద్రాక్షారామ రోడ్డులోని సుంకరపాలెం వద్ద నూతనంగా నిర్మించిన వాసు రెసిడెన్సీని యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ శుక్రవారం అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెసిడెన్సీ యజమాని, మాజీ వర్తక సంఘం ప్రెసిడెంట్ పుగాకు వాసు ఎంఎల్ఎ అశోక్‌ను ఘనంగా సత్కరించారు.

మత్స్యశాఖ అధికారులతో ఎంఎల్ఎ అశోక్ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ అందించాల్సిన వేట నిషేధం నష్టపరిహారానికి సంబంధించి సర్వేను త్వరితగతిన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదేశించారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో పరిపాలనాధికారి మునిస్వామి ఆధ్వర్యంలో మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. అర్హులందరికీ న్యాయం జరగాలన్నారు. వెంటనే సర్వే పూర్తి చేసి జాబితా అందించాలన్నారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ అధికారి గొంతయ్య తదితరులు పాల్గొన్నారు.

శివం బాత్ మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శివంబాత్ మరమ్మతు పనులను శుక్రవారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ప్రతిరోజూ స్నానం చేసే యాత్రికులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, భద్రత కల్పించాలని ప్రజా పనుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి ఎఇ కాళ్ల నాగరాజు పాల్గొన్నారు.

దళితుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని తిరుమాలి దళితులపై జరిగిన దాడుల్లో నిర్లక్ష్యం తగదని ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ పవన్ కుమార్, సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ భానుమతి అన్నారు. శుక్రవారం వారు తిరుమాలి గ్రామాన్ని సందర్శించి గాయపడ్డ దళితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పెత్తందారులు దళితులపై దాడి చేసి, పేటలో తీవ్ర ధ్వంసం సష్టించి పది రోజులు గడుస్తున్న ఇప్పటికీ సరైన న్యాయం జరగలేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి కేవలం 9 మందిని అరెస్టులు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు విప్పర్తి సోమశేఖర్, బిల్లా ఆంజనేయులు, నిర్మల, పద్మ, జ్యోతి, బాధితులు ఉన్నారు.

ఎరువులు, పురుగు మందులివ్వాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వ్యాపారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మాత్రమే విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయకుమార్ సూచించారు. స్థానిక వేదిక ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన వివిధ మండలాల డీలర్లు, అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్సు లేకపోయినా, నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవన్నారు. నకిలీ విత్తనాలు, ఇతర హైబ్రీడ్ విత్తనాలు రైతులకు విక్రయించినా వారి పంటలు నష్టపోయినా నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత వ్యాపారులతో పాటు ఎంఇఒలపై ఉంటుందన్నారు. లైసెన్స్ పొందిన డోర్ నెంబర్ షాపుల్లోనే విక్రయాలు జరపాలని అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ వైవి.గంగాధర్, మండల వ్యవసాయ అధికారులు శ్రీరామ్, సద్గురుమూర్తి, బి.జ్యోతి, టెక్నికల్ ఎఒ గాయత్రి విజయలక్ష్మి ఇతర సిబ్బంది ఉన్నారు.



దివిస్ లేబరేటరీస్ ఏర్పాటుచేసిన రక్షత మంచినీటి ట్యాంక్

భీమేశ్వరాలయంలో రక్షిత మంచినీటి సౌకర్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో యాత్రికుల సౌకర్యార్థం రూ.75 లక్షలతో రక్షిత మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో, నిత్యం వచ్చే యాత్రికులు ఇక్కడకు వస్తుంటారు. వీరందరికీ రక్షిత మంచినీటి సౌకర్యాన్ని హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్ సంస్థ 4 వాటర్ ప్లాంట్లను బహూకరించింది. ఒక్కొక్క ప్లాంట్ 5వేల లీటర్ల కెపాసిటీతో మంచినీరు సరఫరా చేస్తోంది. ఆలయ ముఖద్వారం వద్ద ఒక వాటర్ ప్లాంట్ ను, యాత్రికులు అతిథి గహం వద్ద మరొక ప్లాంటును, హోమ శాల వద్ద ఒక వాటర్ ప్లాంట్ ను, స్వామివారి నూతన అన్నదాన సత్రం వద్ద మరొక వాటర్ ప్లాంట్ ను మొత్తం నాలుగు వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేశారు. రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయడంపై యాత్రికులు ఆలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూలర్స్ ఏర్పాటు

భీమేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీకమాసం, నిత్యం వచ్చే వేలాది మంది యాత్రికులకు రక్షిత మంచినీటి సరఫరాకు నాలుగు మంచినీటి ట్యాంకులను దివిస్ లేబరేటరీ సంస్థ ఏర్పాటుచేసిందని ఇఒ తారాజేశ్వర రావు అన్నారు. వీటితో పాటు ఆరు కూలర్స్ ను ఏర్పాటు చేసి భక్తులకు చల్లని నీటిని అందిస్తున్నామన్నారు. కూలర్స్ వద్ద స్టీల్ బేసిన్ లను గ్లాసులను కూడా ఏర్పాటు చేశాం. యాత్రికులు సౌకర్యార్థం దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ సంస్థ అందజేసిన ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.



కిమ్స్ ఆస్పత్రి వైద్యులను సత్కరించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

'జెఎస్'లో వైద్యుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అమలాపురం

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమంలో వైద్య వత్తి ద్వారా కిమ్స్ వైద్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున ప్రైవేట్ వైద్యులు అందించిన వైద్య సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొ న్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో కిమ్స్ వైద్యులను, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున వైద్య సేవలు అందించిన ప్రవేట్ వైద్యులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రైవేట్ రంగంలో వైద్యులు ముందుకు వచ్చి సమాజ సేవా దక్పథంతో వైద్య సేవలు అందించడం హర్షణీయమన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ ఆరోగ్య భద్రతకు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన ప్రైవేటు వైద్యులను అభినందించారు. కోనసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్ డాక్టర్ ఆనందాచారి, కంటి వైద్య విభాగం హెడ్ డాక్టర్ ఎ వెంకట సతీష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చెందిన చిన్న పిల్లల వైద్యులు వైవిఎస్ఎన్ మూర్తి, కంటి వైద్యులు డాక్టర్ కె సత్య ప్రసాద్ లను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ మంలో డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం దుర్గారావు దొర తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణరంగ కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

నిర్మాణరంగ కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వైసిపి జిల్లా కార్యదర్శి అలమండ చలమయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక దిబ్బలపాలెంలో శుక్రవారం నిర్వహించిన విఘ్నేశ్వర భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో 700 మంది నిర్మాణరంగ కార్మికులు ఉన్నారన్నారు. సంఘానికి అన్ని విధాలా అనువైన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించామన్నారు. ఎంఎల్ఎ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిర్మాణరంగ కార్మికుల పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోంది

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాక రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని జగ్గంపేట మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం జగ్గంపేట టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వంలో చేసిన సంక్షేమం ఏంటో చెప్పి ఎన్నికలకు వెళ్లాలని జగన్ ప్రభుత్వానికి సూచించారు. ఇక్కడి నుంచి టిడిపి, జనసేన ఉమ్మడి ప్రణాళికలతో పని చేస్తున్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 52 నెలలు అవుతుందని, సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకూ రూ.8.25 లక్షల భారం ఈ ప్రభుత్వంలో పడిందన్నారు. ధరలు విపరీతంగా పెరిగాయని, విద్యుత్ ఛార్జీలు రూ.57 వేల కోట్లు భారం వేశారని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన రూ.2.2 లక్షల కోట్లు బినామీ విద్యుత్ కాంట్రాక్టర్ల ద్వారా రూ.15 వేల కోట్ల కమిషన్ వచ్చినా మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కలుషిత మద్యం ద్వారా 35 లక్షల మందిని రోగాల భారిన పడేశారన్నారని, ఎంతో మంది ప్రాణాలు తీశారని ఆరోపించారు. మద్యం ద్వారా రూ.4 వేల కోట్లు నెలకు కమిషన్ రూపంలో తాడేపల్లి ప్యాలేస్‌కు వస్తోందన్నారు. ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, పాల్గొన్నారు.

సాధికార యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఈ నెల 23న ప్రత్తిపాడు నియోజకవర్గంలో జరిగే సామాజిక సాధికారత యాత్రను జయప్రదం చేయాలని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ధర్మవరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి జగనే ఎందుకు రావాలన్న కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొళ్ళ క్రాంతి సుధాకర్, జడ్పిటిసి బెహరా రాజరాజేశ్వరి, సర్పంచులు ఎంపిటిసీలు సచివాలయ కన్వీనర్లు ఉన్నారు.

వివేకానంద పార్క్ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

సందర్శకులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా వివేకానంద పార్కును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు హామీ ఇచ్చారు. వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు కమిషనర్ నాగ నరసింహారావు శుక్రవారం పార్కును సందర్శించారు. పార్కు నిర్వహణ, అక్కడి సమస్యలను పరిశీలించారు. పార్కు ఆవరణలో శునకాల బెడద, టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వాకింగ్ ట్రాక్ ఇబ్బందులతో పాటు మరికొన్ని సమస్యలను వాకర్స్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరంగా పార్కు అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. అక్కడికి వచ్చే సభ్యులు నామమాత్రపు సొమ్ముతో నిధిని సమకూర్చుకొని సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని సూచించారు. వాకర్స్ ప్రతినిధులు తన దష్టికి తీసుకువచ్చిన సమస్యలను నవంబర్ నెలాఖరు నాటికల్లా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరి శ్రీనివాస్, కార్యదర్శి నేమాని సత్యనారాయణ, ఆంజనేయులు ఆయన వెంట ఉన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి-పెద్దాపురం

ప్రాచీన భారతీయ వైద్యుడు ధన్వంతరి జయంతి వేడుకలు నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలోని రామాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ భారతీయ సమాజంలో వైద్య సేవలు ధన్వంతరి ద్వారా అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మన అమ్మన్న, తమిరి శ్రీను, రాకుర్తి పుల్లయ్య, పెనుమర్తి ఆదినారాయణ, గుడివాడ సింహాచలం, త్రిమూర్తులు, నాగబాబు, కొండబాబు, సత్తిబాబు, శ్రీను, గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మెట్ట ప్రాంతాలలో అధిక శాతం భూముల్లో పండించే కర్ర పెండలం దుంప రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జానకి అన్నారు. శుక్రవారం ఉద్యాన శాఖ అధికారి సుజాతతో కలిసి ఆమె మండల పరిధిలోని పలు గ్రామాల్లో కర్రపెండలం దుంప చేలను పరిశీలించారు. ఈ ఏడాది వర్షాభావం వల్ల కర్రపండలం దుంప పంటకు నష్టం కలగకుండా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు.

పులిమేరులో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పులిమేరులోని కనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో గ్రామ ప్రజలే కాక సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ అన్నదానంలో సింగన చంటియ్య, కంటిపూడి సాయి, కర్రి రాంబాబు, సుందరరెడ్డి రాజు, తుమ్మల అచ్యుతరామయ్య, సింగన అంజి, ఎద్దు కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

ఎపి హేట్స్ జగన్ : కొండబాబు

ప్రజాశక్తి-కాకినాడ

ఆంధ్ర రాష్ట్ర ప్రజలు జగన్ అవినీతి, అరాచక, దోపిడీ పాలనను తరిమి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నది ఎపి నీడ్స్ జగన్ కాదని, ఎపి హేట్స్ జగన్ అని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి పన్నులు, విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచి, చెత్తపై పన్నులు వేసి దోచుకుంటున్నందుకా ఎపి నీడ్స్ జగన్ అని ప్రశ్నించారు. మద్యం కమిషన్ల కోసం నాసిరకం మద్యంతో 35 లక్షల మందిని రోగాల బారిన పడినందుకా, 30 వేల మంది ప్రాణాలు తీసినందుకా అని ఎద్దేవా చేశారు.

యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-మామిడికుదురు

యూనియన్ బ్యాంక్ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల రుణాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పాసర్లపుడి సర్పంచ్ కోనుకు ప్రేమ జ్యోతి నాగరాజు అన్నారు .శుక్రవారం యూనియన్ బ్యాంక్ 105 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు పాశర్లపుడి బ్రాంచ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం బ్రాంచ్ మేనేజర్ పి వీరబాబు మాట్లాడుతూ తమ బ్రాంచ్ రూ. 10 కోట్ల డిపాజిట్లు కలిగి ఉందన్నారు. రూ.25 కోట్లను వివిధ రకాల రుణాలగా ఇచ్చినట్లు తెలిపారు. ముద్ర, హౌసింగ్, పిఎమ్ఇజిపి, డ్వాక్రా, విద్యా రుణాలు అందిస్తున్నామని వాటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా తమ బ్యాంక్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో తోరం భాస్కర రావు, వాకపల్లి వీరాస్వామి, బొరుసు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తల కేసులపై న్యాయపోరాటం

ప్రజాశక్తి-కొత్తపేట

జగన్ పాలనలో టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని వాళ్ళందరికీ అండగా వుంటూ వారి తరపున న్యాయ పోరాటం చేసేందుకు నారా లోకేష్ ప్రత్యేక చర్యలు చేపట్టారని కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. వై ఎపి నీడ్స్ జగన్ కాదని ఎపి హేట్స్ జగన్ అని ప్రజలంతా అంటున్నారని సత్యానందరావు అన్నారు. వాడపాలెం గ్రామంలో సత్యానందరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలపై పెట్టిన కేసుల వివ రాలు కూడా పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

'గుడ్ సీడ్' ద్వారా పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-అమలాపురం

సామాజిక సేవా రంగంలో బహత్తరమైన సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విశేష కషిచేస్తున్నట్లు గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు కుంచే రమణారావు పేర్కొన్నారు. జనుపల్లిలో గుడ్‌సీడ్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం గుడ్‌సీడ్ ఫౌండేషన్ ద్వారా జరిగే సేవా కార్యక్రమాల భవిష్యత్తు ప్రణాళిక పై ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సంస్థ ఫౌండర్ అండ్ ఛైర్మన్ రమణారావు మాట్లాడుతూ భవిష్యత్తులో గుడ్‌సీడ్ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టేందుకు కషిచేస్తున్నట్లు రమణారావు తెలిపారు. సామాజిక వేత్త పచ్చిమాల బాబ్జి తదితరులు రమణారావు సేవానిరతిని కొనియాడారు. కార్యక్రమంలో గుత్తుల సత్యనారాయణ, కుంచే బాబులు, కంచర్ల జాన్సన్, పథ్వీ, గుత్తుల బాబ్జి, కుంచే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ పడిపోయినవి

పిఠాపురం మండలం, పిఠాపురం గ్రామంకు చెందిన బర్రె శేషుబాబు, తండ్రి: బర్రె చిన నూకరాజుకు చెందిన ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్స్ (SSC మరియు Inter) పడిపోయినవి. సర్టిఫికెట్ నెంబర్ SSC (155248), మరియు Inter (A106940) ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల నుండి తీసుకుని వెళ్తుండగా అన్నంపల్లి వెళ్లేసరికి నా సర్టిఫికెట్లు పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది అడ్రసుకు అందజేయగలరు.

బర్రె శేషుబాబు
S/o. చిన నూకరాజు, 1-3-97/బి1,
సురపువారి వీధి, పిఠాపురం,
కాకినాడ జిల్లా, సెల్: 9603370830

మహారాజశ్రీ ఏలూరు 1st అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి వారి కోర్టులో

M.V.O.P. No. 590/2022

Between:
కొమవరపు రత్నకుమారి & అదర్స్ -పిటీషనర్స్
&
వసంతవాడ సందీప్ & అదర్స్ -రెస్పాండెంట్స్

R-3: బి.కుర్మయ్య, తండ్రి: అన్నమయ్య, షిఫ్ట్ డిజైర్ కారు నెం. AP 37 AV 6667 కు ఓనర్, డోర్ నెం. 75-5, ఓల్డ్ ఆంధ్రాబ్యాంక్, అనపర్తి, తూ॥గో॥జిల్లా అను వారికి

నోటీసులు అమలు కొరకు **ది. 01-12-2023 ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

కొల్లు శ్రీనివాసరావు
కొప్పర్తి పాండురంగారావు
అడ్వకేట్, తూర్పువీధి, ఏలూరు
ఏలూరు సెల్: 9440188765
ది.9-11-23 7989695030

SUMMONS FOR SETTLEMENT OF ISSUES
(Order V Rules 3 & 5)
IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT :: HAYATHNAGAR.
O.S. NO. 600 OF 2021

Between:
Smt. P. Kalpana and another ... Plaintiffs
AND
Smt. Garimella Surya Kumari and 4 others ...Defendants

To,
D-1 SMT. GARIMELLA SURYA KUMARI, W/O. SRI. NARASIMHA MURTHY, aged about 64 Years, Occ: House Wife, Resident of H. No. 6-195, Pata Gannavaram, Gannavarm-Post, East Godavari District, AP-533240.

Whereas the Plaintiffs have instituted a suit against you for Declaration and other reliefs, you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on **01/12/2023 at 10-30 O' clock** in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of service of this summon a written statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense.

Take notice that in default of your appearance and to file your written statement within 30 days the suit will be heard and determined in your absence.

// By order of the Court //

PUNNA RAVI,
ADVOCATE
#H.No.11-9-101, Laxmi Nagar Colony, Road No.1, Kothapet, Hyderabad.
Cell: 9959910949

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 300/2021

Between:
Thota Venkanna Babu ...*Plaintiff*
AND
Mummidi Veera Prakash Rao, S/o. Satyanarayana, Hindu, aged 62 years, Retired Employee, Kolamuru Village, Rajamahendravaram Rural Mandal, E.G.Dist., Now residing at Kakinada. ...*Defendant*

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. మరియు I.A. 101/2021 లో మీరు సమన్లు అందుకోవడం లేదు. కావున **ది. 06-12-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

సలాది శ్రీనివాసరావు
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
11-11-2023 సెల్:9849197731

In the Court of the 5th Addl. Junior Civil Judge, Kakinada
O.S. No. 283 of 2022

Between:
Manem Veera Venkata Srinivasa Rao, S/o. Veeralingam, D.No. 31-7-23, Rajaji Street, Nallapanna Down, Kakinada. ...*Plaintiff*
AND
1. Gullapudi Alivelu Manga Tayaru, W/o. late G.N.V.N.S.Vara Prasad, Hindu, aged 60 years, D.No. 28-7-52/P, Chitturi vari Street, Kakinada.
2. Gullapudi Sivananda Kiran, S/o. late G.N.V.N.S.Vara Prasad, Hindu, age 48 years, D.No. 28-7-52/P, Chitturi vari Street, Kakinada.
3. Gullapudi Sudha Kiran, S/o. late G.N.V.N.S.Vara Prasad, Hindu, aged 44 years, D.No. 28-7-52/P, Chitturi vari Street, Kakinada.

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీకు గౌరవ కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 1-12-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

S.V.S.KRISHNA PRASAD
N.S.GANESH
Advocates, Rajahmundry
Cell: 9848067468

కాకినాడ నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 7599/2023-జి-1 ది.10-11-2023

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ దిగువ తెలిపిన మాస్టర్ ప్లాను రోడ్డు అయిన మెయిన్‌రోడ్డు (సుభాష్ రోడ్డు) మరియు సినిమా రోడ్డు (వల్లభాయ్ వీధి) నందు భవిష్యత్తులో అభివృద్ధి చేయవలసిన రోడ్లు నిమిత్తము ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలములు అవసరమై యున్నందున ఆయా వ్యక్తులు ముందుకు వచ్చి పై తెలిపిన రోడ్డు విస్తరణకు కావలసిన స్థలములను నగరపాలక సంస్థకి స్వాధీనపరచుటకు తద్వారా వారికి ప్రత్యామ్నాయంగా నష్టపరిహారమునకు బదులుగా Transferable Development Right Certificate (TDRC) నకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనియున్నారు.

ఇందుపై ప్రస్తుతము అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms. No. 119 MA&UD. Dept Dt. 28-03-2017 మరియు తదుపరి ఉత్తర్వులు G.O.Ms. No. 180, MA&UD, Dept, Dt. 01-10-2020 అనుసరించి రోడ్డు విస్తరణకు కావలసిన స్థలమును స్వాధీనపరుచుకుని Transferable Development Right Certificate (TDRC) జారీ చేయుటకు అవకాశము కల్పించబడింది. మరియు సదరు Transferable Development Right Certificate జారీ చేయుటకు ప్రభుత్వము వారు మెమో. నెం. 2250050/M2/2023, MA&UD, Dept. Dt. 30-10-2023, నందు TDR పరిశీలన కమిటీని నియమించియున్నారు. అందుపై సదరు కమిటీ ది. 10-11-2023వ తేదీన సమావేశమై సదరు దరఖాస్తులను సవివరముగా పరిశీలించి ఈ క్రింది తెలుపబడిన దరఖాస్తుదారులకు Transferable Development Right Certificate జారీ చేయుటకు ఆమోదించియున్నారు.

S.No.	Name of the Applicant	Location of the Site Affected	Survey Number	Extent Affected in Road Widening As per Master Plan/ Area Development Plan in Sq.m	Particulars of Road/ Land	Application date	Urban/ Rural	Remarks
1	Mattapalli Suresh Kumar	D.No.39-1-18,19 Cinema Road, Market Value per Sq.yds is Rs.48,000/- as on dt. 10-11-2023	T.S.No. 769, Block No.11, Ward No.4	80.12	Master Plan Road	08-11-2023	Urban	Pending Online TDR Application No. 3838 TDR may be issued
2	1) Kotha Venkata Narasimha Jogendra Sresti, S/o. Kotha Lakshmi Venkayya (late), 2) Kotha Vijaya Lakshmi	Door No. 5-1-60/1a, T.S. No. 1014, Survey Ward No.2, Block No. 24, Subhash Street, Main Road, Market Value per Sq.yds is Rs.95,000/- as on dt. 10-11-2023	T.S.No. 1014, Survey Ward No.2 Block No.24	12.8	Master Plan Road	05-10-2023	Urban	Pending Online TDR Application No.3605 TDR may be issued

పైన తెలిపిన దరఖాస్తుల విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా ఈ క్రింది సంతకము దారునకు లిఖిత పూర్వకముగా తెలుపవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనరు,** కాకినాడ నగరపాలక సంస్థ